31న మెగా జాబ్ మేళా

మెహిదీపట్నం, మే 27 : రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో పేరున్న పాఠశాలల్లో టీచర్ ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, గ్రీన్ ల్యాండ్స్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు రాంరెడ్డి, సందీప్ హరి, డాక్టర్ లక్ష్మి కుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31న సికింద్రాబాద్ బోయిగూడలోని గుజరాతి ఉన్నత పాఠశాల ఆవరణలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీచర్ ఉద్యోగాలే కాకుండా 10 వ తరగతి నుంచి డిగ్రీ వరకు వారి అర్హతను బట్టి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో సుమారు 20 కి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్‌కు సంబంధించిన ఇన్‌స్టాగ్రాం ఐడీలో, ఫేస్‌బుక్ పేజ్‌లో, యూ ట్యూబ్ ఛానల్‌లో సంప్రదించాలని కోరారు. అలాగే https://forms.gle/zc83VxC9uNc9AqBT9 లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, https://whatsapp.com/channel/0029VafKOSY6buMO7mQVzY3r వివరాలకు వాట్సప్ లింక్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు నేషనల్ టెక్నాలజీ డే సదస్సు

సిటీబ్యూరో, మే 27(నమస్తే తెలంగాణ) : నేషనల్ టెక్నాలజీ డే సందర్భంగా నేడు నిపుణులతో ఎన్‌జీఆర్‌ఐలో కీలకోపన్యాస సదస్సు జరగనుంది. అంటార్కిటికాలో దక్షిణ్ గంగోత్రి నిర్మాణం ఓ అద్భుతం అనే అంశంపై పద్మశ్రీ గ్రహీత, ఎన్‌జీఆర్‌ఐ మాజీ డైరెక్టర్ ప్రొ.హర్ష్ కే.గుప్తా ప్రసంగించనున్నారు. ఎన్‌జీఆర్‌ఐలోని ఎస్‌బీ హాల్‌లో మధ్యాహ్నం మూడున్నర గంటలకు జరగనుంది. అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు మెంబర్‌గా ఆయన వ్యవహరిస్తున్నారు.

ఈపీఎఫ్ సమస్యలకు సత్వర పరిష్కారం

సిటీబ్యూరో, మే 27(నమస్తే తెలంగాణ): ప్రావిడెంట్ ఫండ్ సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా నోడల్ అధికారి జీ.వరప్రసాద్ పేర్కొన్నారు. ప్రైవేటు రంగంలో పని చేస్తున్న ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సోమవారం నిధి ఆప్కే నిఖత్ 2.0 పేరిట ప్రత్యేక సెషన్ నిర్వహించినట్లు తెలిపారు. మాదాపూర్‌లోని శ్రీసాయి ప్లాజాలోని శ్రీ చైతన్య స్కూల్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు. పీఎఫ్ సమస్యలు పరిష్కరించేందుకు కేవైసీ, పేరు, పుట్టిన తేదీ సవరణలకు కృషి చేస్తున్నట్లు వివరించారు. జిల్లా నోడల్ అధికారి జీ. వరప్రసాద్, సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్ మేఘరాజు, మేఘన, రాహుల్ రావత్, శ్రీ చైతన్య స్కూల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల అధికారి గౌతమ్

మేడ్చల్, మే 27 (నమస్తే తెలంగాణ): జూన్ 4న జరగనున్న మల్కాజిగిరి లోక్ సభ ఎన్నికల కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ గౌతమ్ ఏఆర్ఓలను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో సోమవారం నియోజకవర్గాల ఏఆర్ఓలతో కౌంటింగ్ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 4న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియను మొదలు పెట్టాలన్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలు హోలీ మేరీ కళాశాలలో, ఎల్బీనగర్‌కు సంబంధించి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, కంటోన్మెంట్‌కు సంబంధించి వెస్లీ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, డీఆర్వో హరిప్రియ, ఏఆర్ఓలు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర డీజీపీ రవి గుప్తా తదితరులు. చిత్రంలో రిహార్సల్స్ చేస్తున్న పోలీసులు

ప్రతాపసింగారంలో హెచ్ఎండీఏ లేఅవుట్

132 ఎకరాలలో రూ. 96 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ): ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణ లక్ష్యంగా పని చేస్తున్న హెచ్ఎండీఏ మరో కొత్త లేఅవుట్ చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. భూసమీకరణ పథకం(ల్యాండ్ పూలింగ్ స్కీం) ద్వారా భూయజమానుల నుంచి భూములను వారి అంగీకారంతో సమీకరించి హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ నిబంధనలకు అనుగుణంగా లేఅవుట్ చేసే పథకాన్ని గత కేసీఆర్ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. తాజాగా ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న ప్రతాపసింగారంలో ఒకచోట సుమారు 132 ఎకరాల భూమిని హెచ్ఎండీఏ సమీకరించింది. గత కేసీఆర్ ప్రభుత్వంలోనే ప్రారంభమైన ఈ ప్రక్రియ ఇప్పుడు పూర్తి కాగా, రైతుల నుంచి సమీకరించిన భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

రూ.96 కోట్లతో లేఅవుట్ అభివృద్ధి..

ఘట్‌కేసర్ మండల పరిధిలోని ప్రతాపసింగారం గ్రామ పరిధిలో ఒకే చోట 132 ఎకరాలను భూ యజమానులు హెచ్ఎండీఏకు అప్పగించారు. భూమిని స్వాధీనం చేసుకున్న హెచ్ఎండీఏ అధికారులు సర్వే పూర్తి చేసి లేఅవుట్ అభివృద్ధి చేసేందుకు అవసరమైన పనులు క్షేత్ర స్థాయిలో మొదలు పెట్టారు. అదే సమయంలో హెచ్ఎండీఏ మాస్టర్‌ప్లాన్ నిబంధనలకు అనుగుణంగా లేవుట్‌లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లు, విద్యుత్ లైన్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందుకోసం సుమారు రూ.96 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి పరిపాలనా అనుమతులు వచ్చిన వెంటనే క్షేత్ర స్థాయిలో భూములను చదును చేసి ప్లాటింగ్ చేస్తామని హెచ్ఎండీఏ అధికారి తెలిపారు. భూ సమీకరణ పథకం కింద అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో భూములు ఇచ్చిన వారికి 60–40 శాతం చొప్పున స్థలాలను కేటాయించి, హెచ్ఎండీఏ వాటాగా వచ్చిన భూములను ఆన్‌లైన్ వేలంలో విక్రయించనున్నట్లు ల్యాండ్ పూలింగ్ విభాగం అధికారి తెలిపారు.

కోలుకున్న గొత్తికోయ యువకుడు

కోలుకున్న తర్వాత సోది నంద

ఖైరతాబాద్, మే 27 : ప్రమాదవశాత్తు గుండెలో బాణం దిగి తీవ్రంగా గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందిన గొత్తికోయ యువకుడు సోది నంద పూర్తిగా కోలుకున్నాడు. బీజాపూర్ జిల్లాలోని ధర్మారం గ్రామానికి చెంది సోది నంద గత సోమవారం అడవి పందిని వేటాడే క్రమంలో బాణం గురి తప్పి అతని గుండె, ఊపిరితిత్తుల్లో దిగిన విషయం విదితమే. అయితే శుక్రవారం నిమ్స్‌లో చేరగా, అర్ధరాత్రి నుంచి తెల్లవారు జాము వరకు కార్డియోథోరాసిక్ సర్జన్ డాక్టర్ అరమేశ్వర్ రావు నేతృత్వంలో వైద్యుల బృందం విజయవంతంగా శస్త్రచికిత్స చేసి బాణాన్ని తొలగించారు. ప్రస్తుతం సోది నంద పూర్తిగా కోలుకున్నాడు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన పేద గొత్తికోయ యువకుడు కావడంతో ప్రభుత్వ చొరవతో నిమ్స్ వైద్యులు పూర్తిగా ఉచితంగా వైద్య చికిత్స చేశారు. త్వరలోనే అతన్ని డిశ్చార్జి చేస్తామని వైద్యులు తెలిపారు.

నేడు హెచ్ఎండీఏ అధికారులతో సీఎం సమీక్ష సమావేశం

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో పొలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యకలాపాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష చేయనున్నారు. హైదరాబాద్ నగర విస్తరణ ఔటర్ రింగు రోడ్డు దాటి విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తు కార్యాచరణ, ఇప్పటి వరకు చేపట్టిన ప్రాజెక్టుల పురోగతి, కొత్తగా నిర్మించే రీజినల్ రింగు రోడ్డు వరకు హెచ్ఎండీఏ పరిధి, విస్తరణ వంటి అంశాలను సీఎం సమీక్షించనున్నారు. ప్రస్తుతం పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సీఎం వద్దే ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 6 నెలలు కావస్తుండటంతో హెచ్ఎండీఏ భవిష్యత్ కార్యాచరణే లక్ష్యంగా అధికారులతో చర్చించనున్నారు. ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రెటరీ, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ దాన కిశోర్, జాయింట్ మెట్రోపొలిటన్ కమిషనర్ ఆమ్రపాలితో పాటు పలు విభాగాల ఉన్నతాధికారులు సమీక్షా సమావేశంలో పాల్గొననున్నారు. సమీక్షా సమావేశాన్ని నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ ఇంటర్‌చేంజ్ వద్ద ఉన్న హెచ్‌జీసీఎల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సమాచారం. హెచ్ఎండీఏతో పాటు హైదరాబాద్ నగరానికి సంబంధించి ఇతర శాఖలతోనూ సీఎం చర్చించే అవకాశం ఉంది.

వికలాంగుల సాధికారతకు ఒప్పందం

ఎంఓయూ పత్రాలను చూపిస్తున్న మిధాని సీఎండీ డాక్టర్ సంజయ్‌కుమార్ ఝా, అలిమ్‌కో సీఎండీ ప్రవీణ్‌కుమార్

సైదాబాద్, మే 27 : జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వికలాంగులకు సాధికారత కల్పించాలని, వారి జీవన నాణ్యతను పెంచాలనే ఆకాంక్షతో కంచన్‌బాగ్ మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ మిధాని (అల్లాయ్స్ కార్పొరేషన్ లిమిటెడ్)తో ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అలిమ్‌కో) అవగాహన ఒప్పందం చేసుకున్నాయని సోమవారం ఒక ప్రకటనలో మిధాని అధికారులు తెలిపారు. వికలాంగుల జీవన నాణ్యతను పెంచే ప్రత్యేక ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి నికెల్, ప్రత్యేక ఉక్కు, టైటానియం ఆధారిత మిశ్రమాల్లో మిధాని యొక్క నైపుణ్యాన్ని ఉపయోగించుకోవటం కోసం అవగాహన ఒప్పందంపై అలిమ్‌కో (ఎంవోయూ)లపై సోమవారం మిధాని సీఎండీ డాక్టర్ సంజయ్‌కుమార్ ఝా, అలిమ్‌కో సీఎండీ ప్రవీణ్‌కుమార్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా తయారు చేసిన సహాయక సాంకేతికతతో మార్కెట్ అవసరాలను తీర్చడంలో కీలక భూమిక పోషిస్తుంది. వనరులను సమీకరించటం ద్వారా రెండు సంస్థలు వైకల్యాలున్న వ్యక్తుల యొక్క విభిన్న అవసరాలను తీర్చగల, అనువైన ఉత్పత్తులను తయారు చేయటమే లక్ష్యంగా పెట్టుకోవటంతోపాటు ప్రాధాన్యతను ప్రోత్సహిస్తాయి. అలాగే దేశ అవసరాలను తీర్చడంతోపాటు రెండు సంస్థలు కలిసి సహాయక సాంకేతిక రంగంలో ప్రపంచ అవకాశాలను అన్వేషించటం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

ఇక్రిసాట్‌లో జాతీయ సదస్సు

సిటీబ్యూరో, మే 27(నమస్తే తెలంగాణ) : ఖరీఫ్ సీజన్‌లో పప్పు దినుసుల దిగుబడిని పెంచడమే లక్ష్యంగా ఇక్రిసాట్‌లో జాతీయ సదస్సు జరిగింది. ఆలిండియా కో ఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్టులో భాగంగా వార్షిక సమావేశం నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో అగ్రి పరిశోధన సంస్థలు, రీసెర్చ్ నిపుణులు హాజరయ్యారు. గతేడాది నిర్దేశిత లక్ష్యాల పురోగతి, ఈ సీజన్‌లో చేపట్టాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా కందులు, పెసళ్లు, మినుములతోపాటు పలు రకాల పప్పు దినుసులను పెంచడమే లక్ష్యంగా చర్చించారు. ఈ సందర్భంగా ఇక్రిసాట్ నిపుణులు ప్రత్యేక చర్చాగోష్ఠి నిర్వహించారు.

ఎందరో జర్నలిస్టులకు స్ఫూర్తి రామకృష్ణ

స్మృతి సంచిక ఆవిష్కరణ సభలో వక్తలు



స్మృతి సంచికను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రసాద్, శంకర నారాయణ, రామచంద్ర రావు, రాఘవేంద్ర తదితరులు

ఖైరతాబాద్, మే 27 : వృత్తిలో నిబద్ధత, విశ్లేషణ, సామర్థ్యంతో పాటు తెలుగు, ఆంగ్ల భాషల్లో విశేష పరిజ్ఞానం ఉన్న అరుదైన జర్నలిస్టు దివంగత భళ్ళమూడి రామకృష్ణ (ఆర్కే) అని సీనియర్ జర్నలిస్టులు, కమ్యూనికేషన్ నిపుణులు కొనియాడారు. తెలుగు, ఆంగ్ల జర్నలిజంలో కోల్పోయిన ఆణిముత్యంగా ఆయనను అభివర్ణించారు. 2021లో కొవిడ్ మహమ్మారికి బలైన రామకృష్ణ (57)వ జయంతి సందర్భంగా ఆయన స్మృత్యర్థం సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'ద టైటాన్ ఆఫ్ ట్రూత్' సంచికను అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్, సైంటిస్టు డాక్టర్ జేవీ ప్రసాద్, హాస్య బ్రహ్మ శంకర నారాయణ, ఆంధ్రప్రదేశ్ పాలన సంస్థ మాజీ సంచాలకులు ద్రోణంరాజు రామచంద్రరావు, ప్రముఖ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ నిపుణులు, పోటీ పరీక్షల శిక్షకులు ఆకెళ్ల రాఘవేంద్ర, ఎన్టీవీ ఎడిటర్ వి.సుందర రామశాస్త్రి, ధాత్రి కమ్యూనికేషన్స్ అధిపతి పమిడికాల్వ మధుసూదన్‌తో కలిసి ఆవిష్కరించారు. డాక్టర్ జేవీ ప్రసాద్ మాట్లాడుతూ.. వృత్తిలో నిబద్ధతతో పనిచేసి ఎందరో జర్నలిస్టులకు స్ఫూర్తిగా నిలిచిన రామకృష్ణ లేని లోటును తీర్చలేమన్నారు. సాహితీ, హాస్య ప్రియత్వం కలబోత రామకృష్ణ అని శంకర నారాయణ కొనియాడారు. తన లాంటి వారెందరికో వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎంతో మేలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ప్రేమ, రాజేశ్వరి, డాక్టర్ ఎస్.రాము, పెమ్మరాజు వెంకటేశ్వరరావు, ఆర్కే సతీమణి వందన ద్విభాష్యం, కుమార్తె లాస్య తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంచండి

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ) : జలమండలిలో ఔట్ సోర్సింగ్ కార్మికులకు వెంటనే కేటగిరి మార్చి జీతాలు పెంచాలని జలమండలి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం ఖైరతాబాద్ జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీ సుదర్శన్ రెడ్డి, డైరెక్టర్ శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. జీవో నంబరు 60లో కేటగిరి 2లోకి మార్చి వేతనాలు పెంచాలని, ఎంఓఎం కార్మికులకు మెయింటెనెన్స్ సేవలు, మ్యాన్‌పవర్ సేవల నుంచి వేరు చేసి జీతాలు ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎండీ సుదర్శన్ రెడ్డి వివరాలను తీసుకొని చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కిరణ్‌కుమార్, బాబు, నరేందర్, నాగరాజు, అనిల్, మల్లేశ్, లక్ష్మణ్, రాములు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఫోస్‌రాక్ ఇండియా కెమికల్ ప్లాంట్

జూబ్లీహిల్స్, మే 27 : నిర్మాణరంగంలో దేశంలో 44ఏండ్లుగా సేవలందిస్తున్న ఫోస్‌రాక్ ఇండియా నూతన ఇంటిగ్రేటెడ్ కన్‌స్ట్రక్షన్ కెమికల్స్ ప్లాంట్‌ను హైదరాబాద్ నగరంలో నెలకొల్పడంతో వినియోగదారుల విశ్వసనీయతను మరింత పెంపొందిస్తుందని జేఎంహెచ్ గ్రూప్ సీఈఓ రాబ్ బొన్నిసి పేర్కొన్నారు. సోమవారం ఫోస్‌రాక్ నూతన ఇంటిగ్రేటెడ్ కన్‌స్ట్రక్షన్ కెమికల్స్ ప్లాంట్‌ను జేఎంహెచ్ గ్రూప్ సభ్యులు డాక్టర్ జేమ్స్ ఎం హే, ఫిట్రియాని హే లతో కలిసి ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా 75 ఏండ్లకుపైగా అంతర్జాతీయ అనుభవంతో 100 దేశాలలో 20కి పైగా ఉత్పాదక, పంపిణీ నెట్‌వర్క్ ఉన్న ఫోస్‌రాక్ ఇండియా.. దక్షిణ భారతదేశంలో భౌగోళిక పరిస్థితులకనుగుణంగా ఉత్పత్తి, సేవల శ్రేణిని విస్తరించినట్లు తెలిపారు.

రాంకీ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలి

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, రాంకీకి ఇచ్చిన కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, టీజేఏసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసీలో అన్ని విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. రాంకీకి ఇచ్చిన కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి యథావిధిగా జీహెచ్ఎంసీ చెత్త సేకరించాలన్నారు. ఎన్నికల కోడ్ తర్వాత కార్మికులతో కలిసి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తామని ఏఐటీయూసీ మున్సిపల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్యదర్శి చర్లపల్లి రాములు, నర్సింహులు, జైపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజేఏసీ నాయకులు ఆకుల శ్రీను, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

150 దేశాలకు 1.65 మిలియన్ల సీడ్ శాంపిల్స్

వ్యవసాయ రంగానికి ఇక్రిసాట్ జెనీబ్యాంక్ సేవలు

అంతర్జాతీయ స్థాయిలో జెనీ కల్చర్‌పై అవగాహన పెంచుతున్న శాస్త్రవేత్తలు

సిటీబ్యూరో, మే 27(నమస్తే తెలంగాణ) : ఆధునిక సాగు విధానాలతో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఇక్రిసాట్ కృషి చేస్తున్నది. శాస్త్రీయ విధానాలు, కొత్త వంగడాల ఆవిష్కరణలతోపాటు, జన్యు బ్యాంక్ సాయంతో అంతరించి పోతున్న ఆహార పంటలను సంరక్షిస్తూ రైతులకు అందిస్తున్నది. శాస్త్రీయ పద్ధతుల ద్వారా సాగు, పంటల నిర్వహణతో రైతుల ఆదాయం, ఆహార పంటల దిగుబడి, పర్యావరణంలో కార్బన్ ఎమిషన్ తగ్గించేందుకు అవసరమైన పరిశోధనలను కొనసాగిస్తూనే.. జెనీ బ్యాంక్ ద్వారా పరిశోధన సేవలను ఖండాంతరాలకు ఇక్రిసాట్ విస్తరిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 150 దేశాలకు ఇక్రిసాట్ పరిశోధన ఫలాలను అందిస్తుండగా.. ఇప్పటివరకు 1.65 మిలియన్ల సీడ్ శాంపిళ్లను పలు ప్రాంతాలకు చేర్చింది.

ఎన్నో సవాళ్లకు ఇక్రిసాట్ పరిష్కారం

ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న ఎన్నో సవాళ్లకు ఇక్రిసాట్ పరిష్కారం చూపే క్రమంలో భాగంగా జెనీ బ్యాంక్ ద్వారా అంతరించి పోతున్న ఆహార పంటలను సంరక్షిస్తున్నది. ప్రధానంగా కందులు, బఠాణీ, వేరుశనగతో పాటు 8 రకాల చిరుధాన్యాల జన్యులను సంరక్షిస్తూ.. వినూత్న వంగడాలను ప్రపంచదేశాలకు అందిస్తున్నది. కరువు, నీటి లవణీయత, అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే వంగడాలను అభివృద్ధి పరుస్తూ.. వాతావరణ మార్పులకు దీటుగా అధిక దిగుబడిని సాధించేలా కృషి చేస్తున్నది. ఈ క్రమంలో ఇప్పటివరకు 150 దేశాలకు 1.65 మిలియన్ల విత్తన శాంపిళ్లను అందించింది. ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రత కారణంగా అంతరించిపోతున్న ఎన్నో రకాల ఆహార పంటలను సంరక్షించేందుకు పరిశోధనలు చేస్తుండగా.. ప్రధాన ఆహార పంటల్లో ఒకటైన సజ్జలను 25వేల జెర్మ్ ప్లాజమ్ నిల్వ చేసి అందించారు. 93 దేశాలకు వేరుశనగ, 61 దేశాలకు బఠాణీ, 72 దేశాలకు కందులు, 93 దేశాలకు జొన్నలు, 51 దేశాలకు సజ్జలు, మరో 51 దేశాలకు చిరుధాన్యాల విత్తన బ్యాంక్‌ను అందించి వ్యవసాయ జీవవైవిధ్యాన్ని పెంపొందించేలా కృషి చేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 150కి పైగా దేశాలు ఇక్రిసాట్ డెవలప్ చేసిన వంగడాలను వినియోగిస్తున్నట్లు పరిశోధకులు తెలిపారు.

జూన్ 3 నుంచి 'పది' అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

సిటీబ్యూరో, మే 27, (నమస్తే తెలంగాణ): పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో పది అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జూన్ 3 నుంచి 13 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్న పది సప్లిమెంటరీ పరీక్షను 12,186 మంది విద్యార్థులు రాయనున్నారని, 35 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమలు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకువెళ్లేందుకు అనుమతి లేదన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి ఆర్ రోహిణి, డీసీపీ ఎం.బాపూరావు, టీఎస్ ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం కే.మహేశ్ కుమార్, డీపీఆర్వో అబ్దుల్ కలీం, డీఎం అండ్ హెచ్ఓపీఓ డాక్టర్ సుధా మాధవి పాల్గొన్నారు.

ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, మే 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను అధికారులు ఖరారు చేశారు. పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 7 నుంచి, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆరో సెమిస్టర్ రెగ్యులర్, ఎల్ఎల్‌బీ ఆనర్స్ ఆరో సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల లా కోర్సు ల పదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను 11 నుంచి నిర్వహించనున్నారు.

ఎం ఫార్మసీ పరీక్ష తేదీల మార్పు

ఓయూ పరిధిలోని ఎం ఫార్మసీ పరీక్ష తేదీలను మార్చినట్లు అధికారు లు తెలిపారు. ఎం ఫార్మసీ మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 6 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కానీ వివిధ కారణాల రీత్యా వాటిని వా యిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను తిరిగి వచ్చే నెల 11 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఇంటర్ మూల్యాంకనంలో జరిగిన తప్పిదాలను సరి చేయాలి

హిమాయత్‌నగర్, మే 27: ఇంటర్ మూల్యాంకనంలో జరిగిన తప్పిదాలను సరిచేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలి ఉల్లాఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇంటర్ పరీక్ష పేపర్లను దిద్దడంలో అధ్యాపకులు అలసత్వం వహించారని ఆరోపించారు. ఇటీవల ఇంటర్ బోర్డు వెల్లడించిన ఫలితాల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తక్కువ మార్కులు వచ్చాయని తెలిపారు. ఫలితాలపై సందేహాలు రావడంతో 48వేల మంది పున:పరిశీలనకు, 2వేల మంది పున: లెక్కింపునకు దరఖాస్తు చేసుకోగా ఇందులో కొంతమంది విద్యార్థులకు ఎక్కువగా మార్కులు వచ్చాయన్నారు. పరీక్ష పేపర్లను దిద్దడంలో అలసత్వం వహించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్యప్రసాద్ పాల్గొన్నారు.

రేపటి నుంచి బాల సాహిత్య సమ్మేళనం

తెలుగు యూనివర్సిటీ, మే 27 : తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఈ నెల 29, 30 తేదీల్లో బాలసాహిత్య సమ్మేళనం నిర్వహించనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడూరు శాంతమ్మ స్మారకార్థం శాంతావసంతట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ కె.ఐ వరప్రసాద రెడ్డి నిర్వహణలో జరుగుతున్న బాలసాహిత్య సమ్మేళనంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు రెండు వందల మంది బాల సాహితీవేత్తలు, రచయితలు, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. బడిలో తెలుగు భాష, బాల సాహిత్యం–పత్రికలు, కథ చెప్పే కళ, సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం, శిల్ప, జానపద కళల పరిచయం, బాల సాహిత్యం–ప్రమాణాలు, బాలసాహిత్యం–గ్రంథలయాలు తదితర అంశాలపై చర్చాగోష్ఠి, సదస్సులు జరుగుతాయన్నారు. బాలల సమగ్ర వ్యక్తిత్వ వికాసం కోసం.. సాహిత్య వైభవం, ఆరోగ్యం–విజ్ఞానం గ్రంథాలతో పాటు పిల్లల కోసం పిల్లలు రాసిన కథల ఐదు సంపుటాలను ఈ సందర్భంగా ఆవిష్కరిస్తారని చెప్పారు.